వియ్యము

సామవేదం జానకిరామశర్మగారు

ఐదుగురుబిడ్డలవెనుక పుట్టినదగుటచే తలిదండ్రు లామెకు మిగులప్రేమతో "నిరుపమా" యని పేరు పెట్టిరి. ఈజాతియం దిట్టి మనోహరమైనపే రిదివర కెన్నడును వినరాలేదు. తఱచు దేవతలనామములే వాడబడుచుండెడివి. గణేశుడు, కార్తికుడు, పార్వతి వీని కుదాహరణములు. ఇపుడు నిరుపమాకల్యాణవిషయ మాలోచింపబడుచున్నది. తండ్రియగు రామసుందరు డమితప్రయత్న మొనర్చినను నచ్చిన వరుడు లభించలేదు. తుద కొకజమీందారునియింటి గారాబుపుత్రునకు సంబంధము నిశ్చితమాయెను. జమీందారుని తండ్రితాతల సంపద కొంతలోకొంత నష్టమైనను పేరుప్రతిష్ఠలుమాత్రము నిలచియుండెను. పిల్లవాని తరఫువారిచే పదివేల రూపాయలరొక్కమును తగినంత వరకట్నమును కోరబడెను. రామసుందరు డీవిషయముపై ఆలోచన యొనర్పక సమ్మతించెను. కారణము యిట్టిపిల్లవాని నేవిధముగను చేయిజారి పోనీయరాదని తలచుటయే.

చివరకు రూపాయ లేవిధముగను పోగుకాలేదు. తాకట్టువుంచి, అమ్మి మిక్కిలిప్రయత్నముచేసినను కూడ ఆరు ఏడువేలరూపాయలు తక్కువాయెను. వివాహపురోజులు దగ్గరకొచ్చుచున్నవి. చివరకు వివాహపురోజుకూడ వచ్చెను. మిక్కిలి హెచ్చువడ్డీపైన మిగిలినరూపాయలనిచ్చుట కొకానొకడు మాట యిచ్చియుండెను. కాని యది మాటరూపముననే యుండిపోయెను. వివాహవేదికపై కీచులాట ప్రారంభమై పెద్దయల్లరి వ్యాపించెను. రామసుందరుడు జమీందారునితో చేతులుజోడించి యిట్లు చెప్పెను. "శుభకార్యము పూర్తికానిండు; రూపాయలను నేను తప్పక వసూలిత్తును." జమీందారుడువచించెను: "రూపాయలు లేక కుఱ్ఱవాడు వివాహవేదికపైకి రాజాలడు" అని. ఈదుర్ఘటనచే నంతఃపురమందు రోదనముకూడ ప్రారంభమాయెను. ఈ మహదాపదకు మూలకారణమైనయామె వైవాహికవస్త్రములను ధరించి సొమ్ములలంకరించుకొని, మోముపై తిలకముంచుకొని నిశ్శబ్దముగ కూర్చొనియున్నది. కాబోవు శ్వశురవంశముపై నామెకు భక్తి, లేక ప్రేమ బాగుగ నభివృద్ధినొందుచున్నదో లేదో చెప్పజాలము.

ఇంతలో నొకనూతనవార్త పుట్టెను. వరుడు సాహసించి తనతండ్రికి వ్యతిరేకుడాయెను. అతడు తండ్రితో ఇట్లుచెప్పి కూర్చుండెను. "క్రయవిక్రయముల వ్యాపారపుమాటలకు నేను సమ్మతించను. వివాహముచేసుకొనుటకు వచ్చితిని. చేసుకొనియే వెళ్లెదను." తండ్రి దగ్గరనున్నవారితో చెప్పెను. "చూడండి: నేటికుఱ్ఱవాండ్ర ధైర్యము." ఒకరిద్దరు ప్రవీణపురుషులు "శాస్త్రశిక్షణమును, నీతిశిక్షణమును ఇందువలననే బొత్తిగా నశించినది" అని వచించిరి. వర్తమానకాలమందలి శిక్షణకు విషమయఫలమును తన సంతానమందు ప్రత్యక్షముగచూచి జమీందారుడు హతోద్యముడై కూర్చొనెను. వివాహమెటులనో ఉదాసీనముగ ఆనందరహితముగ నాయెను.

అత్తవారింటికి పంపునపుడు తండ్రి నిరుపమను కౌగలించుకొని అశ్రువుల నాపలేకపోయెను. నిరుపమ ప్రశ్నించెను: "వారు నన్ను మరల రానియ్యరా? నాయనా!"

రామసుందరుడు:—ఏల రానీయరు? రానిత్తురమ్మా! నేను నిన్ను తీసుకువత్తునులే.

రామసుందరుడు తఱచు వియ్యంకునింటికి పుత్రికనుగాంచుటకై వెళ్లుచుండెనుగాని అచట నాతనికెట్టి గౌరవమునులేదు. నౌకరులు చాకరులుగూడ నీచముగ చూచుచున్నారు. అంతఃపురమందలి బైటనున్న గవాక్షముకడ ఒకరోజున ఐదునిముసములు నిలచిమాటలాడును. లేనిరోజున నూరక మరలివచ్చును. వియ్యంకుని యం దిట్టియవమానము సహింపబడజాలదు. రామసుందరు డెటులైనను రూపాయలను పూర్తిజేసియిచ్చుటకు

నిశ్చయించెను. కాని ఇంతకుపూర్వము నెత్తిపైనున్న ఋణభారమే దింపుకొనుట కఠినముగనున్నది. గృహనిర్వహణవ్యయమే ఎటులనో వెనుక ముందు లాగుటచే నడచుచున్నది. ఐనను ఋణదాతల దృష్టినుండి తొలగుటకు పలువిధముల యత్నించుచుండెను.

ఇచట అత్తవారియింట పుత్రికకు కూర్చొనినను, నిలచినను నిష్ఠురభాషణములు వినబడుచున్నవి. తలిదండ్రుల నిందనువినుచు గదితలుపుమూసుకొని కన్నీళ్ళ ప్రవహింపజేయుటతో నామెకు రోజుగడచుచున్నది. ముఖ్యముగ అత్తగారికసరుట యేవిధముగను అరికట్టబడుటలేదు. ఎవరైనను "ఆహా! యెంత అందమైనది. కోడలు ముఖముచూచిన సంతోషముజనించును" అన్న అత్తగారులికిపడి "కాదా! ఎట్టియింటి పిల్ల కట్టి సౌందర్యము"అనును. ఇంతయేల? కోడలి అన్నపానీయములపైకూడ ఎవరును శ్రద్ధతీసుకొనుటలేదు. ఎవరైన నామెపై దయచూపిన అత్తగారు "చాలు. ఇక నెక్కువ తండ్రి రూపాయలనన్నిటిని యిచ్చినగాని బిడ్డకు పూర్తిగ గౌరవముండదు" అని పల్కును. కోడలికిచట హక్కులేనట్లు ప్రతిదానియందును ద్యోతకముచేయుచుండును. అందుచే కోపముకూడ చెందుచుండును.

బహుశః పుత్రిక యనుభవించుచున్న అనాదరము, అవమానము తండ్రిచెవులవరకువెళ్లియుండవచ్చును. దీనిచే రామసుందరుడు చివరకు తాను వసించుచున్న ఇల్లుగూడ అమ్ముటకు ప్రయత్నింపసాగెను. కాని పిల్లలకీవిషయము తెలియకుండనే దాచియుంచబడెను. ఏలనన గృహహీనులమైతిమని వారెరిగిన దుఃఖింతురు. ఇల్లు అమ్మి దానినే తిరిగి యద్దెకుతీసుకొనియుండుటకును, తాను బ్రతికియున్నంతవర కీవిషయము పిల్లలకు తెలియకుండునట్లు దాచియుంచుటకును నిశ్చయించుకొనెను. కాని పిల్లలకీవిషయము తెలిసెను. అందరును రామసుందరుని కడకువచ్చి యేడువసాగిరి. విశేషించి పెద్దవారిముగ్గురలో కొందరకు బిడ్డలుగూడఉన్నారు. వారి రోదనము మిక్కిలి గంభీరరూపమునుదాల్చి చివరకు గృహమునమ్ముట మాన్పివైచినది. అపుడు రామసుందరుడు కొద్దికొద్ది మొత్తములను హెచ్చువడ్డీకి తీసుకురాసాగెను. తుదకు కుటుంబపుఖర్చు నడచుటయే కష్టమైపోయెను. తండ్రి నిరుపమకడకు వచ్చినపు డాతని ముఖముగాంచి అంతయు తెలుసుకొనెను. వృద్ధుడగు తండ్రియొక్క నెరసిన కేశములమీదను, నీరసమగు ముఖముపైనను ఎల్లపుడు దైన్యవిచారముల ఛాయ స్పష్టముగ కనుపించసాగెను. కుమార్తెకడ తండ్రి యపరాధియైనపు డాతని పరితాపము దాచియుంచబడగలదా? రామసుందరుడు వియ్యంకుని యనుమతిపై క్షణకాలము మాటలాడునపుడాతనిహృదయ మేవిధముగ వ్యథనొందుచుండెనో అప్పటి యాతని నవ్వుగాంచిన తెలియవచ్చుచుండెను. కేవలము తండ్రియొక్క వ్యథిత హృదయము నోదార్చుటకుగాను పుట్టినింటికేగ నిరుపమ ధీరురాలాయెను. తండ్రియొక్క నీరసమగు మోము గాంచి యామె దూరముగనుండజాలకపోయెను.

ఒకనా డామె తండ్రితోననెను "నాయనగారూ! నన్నింటికి తీసుకొనివెళ్లుడు."

రామ:—"మంచిదమ్మా! అటులనే."

కాని యాతనికట్టి శక్తియులేదు. తమకుమార్తెలపై సాధారణముగ తండ్రులకుండు సహజాధికారము వరున కీయసమ్మతించిన కట్నమునకై తాకట్టుంచబడినది. కాన పుత్రికకడకేగుటకుగూడ మిగుల సంకోచముతో ననుజ్ఞ యాచింపబడుచున్నది. ఒక్కొక్కప్పుడు హతాశుడైనపుడు రెండవమాట మాటలాడుటకుగూడ ఆతనికి నోరాడుటలేదు. కాని పుత్రిక పుట్టినింటికివత్తుననిన తండ్రి పాపమామెను తీసుకొనిరాకుండగ ఎటులుండగలడు? ఇందుచే వియ్యంకుని సమక్షమున కీదరఖాస్తును పంపుటకుపూర్వము రామసుందరు డెట్టి హైన్యము, ఎట్టి అవమానము, ఎంతకష్టమును సహించి మూడువేలరూప్యములను పోగుచేసియుండెనో ఆయితిహాసమును గుప్తపఱచుటయే మంచిది.

రూపాయలనోట్లను రుమాలునందుమూటకట్టి రామసుందరుడు వియ్యంకుని సమక్షమునకేగికూర్చొనెను. మొదట మోముపై చిరునగవునటించుచు బజారువిశేషముల నెత్తెను. "హరకృష్ణునింటిలో పెద్దదొంగతనము జరిగినది. ఆతనియత్నముచే చివరకు పట్టుబడినది. సోదరులగు నవీనమాధవ రాధామాధవు లిరువురిలో విద్యాబుద్ధులందును, స్వభావమందును రాధామాధవు డుత్తముడు. పట్టణమం దొకనూతనజాడ్యము వ్యాపించినది. దానినిగూర్చి జనులు విపరీతముగ చెప్పుకొనుచున్నారు." ఇటుల నుడువుచు చివరకు హుక్కాగొట్టమునావల యుంచి మాటలసందున చెప్పెను. "హహ, బావగారూ! తమకింకను రూపాయలబాకీయుంటిని. వచ్చునప్పుడెల్ల కొంతసొమ్ము తీసుకొనిరాగోరుదునుగాని బయలుదేరివచ్చునప్పటి కాసంగతి మరతును. రాను రాను వృద్ధుడనుకూడ అగుచున్నాను." ఇటు లొకదీర్ఘోపన్యాసమిచ్చుచు హృదయశల్యములతో సమానమగు ఆమూడునోట్లను బహుసులభముగా బయటపెట్టెను. నోట్లను మూటిని తీసుకొనిచూచి జమీందారుడు వికృతముగ నవ్వుచు పలికెను: "బావగారూ! ఉండనీయుడు నాకివి అవసరములేదు. స్వల్పమునకై హస్తమును మలినమొనర్పగోరుటలేదు." ఇట్టి ఘటనానంతరము కుమార్తెను తీసుకొనివెళ్ళుదునని ఏముఖము పెట్టుకొని అడుగగలడు? కాని రామసుందరుడు బంధుసంకోచమిప్పు డనవసరమని ఎంచెను. హృదయమందలి ఆతీవ్రాఘాతమునకు కొంచెము సేపూరకుండి బిడియమువిడచి బయటపెట్టెను. జమీందారు డెట్టికారణమును నుడువకయే "ఇప్పుడు కాదు" అని జవాబుచెప్పి పనిమీద బయటకేగెను. రామసుందరుడు కుమార్తెకడకేగకుండనే వణకుచున్న చేతులతో మరల నోట్ల నారుమాలున ముడివైచి మెల్లగ యింటికివచ్చెను. మనస్సునందు "పూర్తిగా రూపాయలను సంపాదించి కుమార్తెపై నిస్సంకోచమగు యధికారమును పొందనిదే వియ్యంకుని యింటికేగ"నని ప్రతిజ్ఞపట్టెను.

చాలదినములు గడచినవి. నిరుపమ మనుజునిపై మనుజుని పంపుచుండెనుగాని తండ్రిదర్శనము లభింపలేదు. చివరకు కోపించి మనుజులనంపుట మానెను. రామసుందరుని మనస్సు వ్యధచెందెనుగాని అప్పుడుకూడ వెళ్ళలేదు. ఆశ్వయుజమాసము వచ్చెను. రామసుందరుడు "పూజలకుగాను నేను కుమార్తెను తీసుకొనివత్తును లేనిచో—" పెద్దపెద్ద ప్రతిజ్ఞలొనర్చి కూర్చొనెను.

పంచమి లేక షష్ఠిరోజున మరల రుమాలునందు కొన్నినోట్లనుకట్టి ప్రయాణమాయెను. ఐదేండ్ల ఈడుగల మనుమడువచ్చి "తాతా! నాకు బండీకొనుటకు వెళ్ళుచున్నావా?"అనియడిగెను. చాలదినములనుండియు ఆతనికి బండిపై షికారువెళ్ళుటకు కోరికగలదు. కాని అదిఏవిధముగను పూర్తికాలేదు. ఆరేండ్ల మనుమరాలు యేడ్చుచువచ్చి "పూజచేసుకొనుటకు దేవాలయమునకేగుటకు నాకు మంచి పట్టువస్త్రములే"దనిచెప్పెను.

రామసుందరుడు తాను వెళ్ళుటనుగూర్చి పొగపీల్చుచు కొంచెముసే పాలోచించెను. జమీందారుని యింటికి పండుగదినములలో సాధారణవస్త్రములధరించి కృపాపాత్రుడగు దరిద్రునివలె వెళ్ళవలెనా? ఈవిషయ మాలోచించి ఆత డొకదీర్ఘనిశ్వాసమును విడచెను. దానిచే యాతని లలాటమందలి రేఖలు స్పష్టముగా చిత్రింపబడుటకన్న ఎట్టిఫలమును కలుగలేదు. దరిద్రముచే పీడింపబడుచున్న తనయింటియందలి క్రందనధ్వని కర్ణములునిండ వృద్ధుడగు రామసుందరుడు వియ్యంకునియింట ప్రవేశించెను.

పూర్వమువలె నౌకరులయెడ తాను సలజ్జముగ దృష్టిబరపినట్లుగాక నేడు నిస్సంకోచముగ తనగృహమందు ప్రవేశించినట్లే ప్రవేశించెను. లోపలికేగగా జమీందారు ఇంటిలోలేనట్లు తెలియవచ్చెను. కొంచెముసేపూరక కూర్చొనియుండవలసి వచ్చెను. రామసుందరుడు తొందరనాపలేక కుమార్తెకు కబురంపెను. ఆనందాతిరేకముచే నిరువురి నయనములనుండియు బొటబొట కన్నీరుగారెను. తండ్రి యేడువసాగెను. పుత్రిక

కూడ రోదన మారంభించెను. ఎవరినోటినుండియు మాట వెలువడలేదు. ఇటుల కొన్నినిముసములు గడచెను. రామసుందరుడు "నేడు నిన్ను తీసుకొనివెళ్లెదనమ్మా! యిప్పుడేమియు యిబ్బందిలేదు" అనెను.

ఇంతలో రామసుందరుని పెద్దకుమారుడు హరమ్మోహనుడు తనకుమారు లిరువురితో సాహసముగ నింటిలోప్రవేశించి తండ్రితో "నాయనా! మేము బజారులో ముష్టియెత్తుకొనవలయునా?" అనెను. రామసుందరుడు క్రోధముతో "మీకొరకు నేను నరకకూపమున బడుదునా? మీరు నన్ను సత్య పాలన మొనర్ప నీయరా?" యనెను. రామసుందరుడు గృహము నమ్మివైచెను. పిల్లలకు మొదట ఈవిషయము తెలియకున్నను పిమ్మట తెలియవచ్చెను. దీనివలన తండ్రికి పిల్లలపై చాలకోపమువచ్చెను. కొంత కలహముకూడ సంభవించెను. మనుమడు చేతులుపట్టుకొని మోమెత్తి "తాతా! నాబండి" అని దీనముగపల్కెను. రామసుందరుడు శిరమువంచుకొని నిరుత్తరుడై నిలబడియుండెను. అందుచే బాలుడు నిరుపమవద్దకు పరుగెత్తుకొనవచ్చి "అత్తా! నాకొకబండీ యిప్పించవా?" అని యడిగెను. నిరుపమ అంతయు తెలుసుకొనెను. "నాయనగారూ! మీ రొకపైసాయైనను మామగారికిచ్చిన మీకుమార్తె నిక చూడజాలరు. ఇది మీశరీరమును స్పృశించి యొట్టు పెట్టుచున్నాను" అనెను.

రామ:—ఛీ, బిడ్డా! ఇటువంటిమాటలనా పలుకుట? నేను రూపాయలనీయలేకపోయిన నాకగౌరవమును, నీకవమానమును కాదా? అనెను.

నిరుపమ:—అవమానము రూపాయలనిచ్చుటలో గలదు. నీకుమార్తె కింతగౌరవములేదా? రూపాయలున్నంతవఱకు గౌరవముండి, లేనిచో విలువలేనట్టి రూపాయలసంచినగుదునా నేను? వద్దు నాయనా! రూపాయలనిచ్చి నన్నవమానముపాలు సేయకుడు. మరియు మీఅల్లుడుకూడ రూపాయల నాశించుటలేదు.

రామ:—ఐన వీరిక నిన్ను తీసుకొని వెళ్ళనీయరమ్మా!

నిరుపమ:—పంపకున్న నేమిచేతురు? చెప్పుడు?

రామసుందరుడు కంపించుచున్న హస్తములతో నోట్లుకట్టిన యుత్తరీయమును భుజమునవేసుకొని దొంగవలె నేరికంట బడకుండ యింటికేగెను.

కాని రామసుందరుడు ధనమునుతెచ్చుటయు, కుమార్తె యిష్టముపై నీయకుండ వెళ్ళుటయు చాటున నుండి సంభాషణలవినిన దాసియొకతె అత్తగారితో చెప్పివైచెను. ఇది విని దాగియున్న అత్తగారి క్రోధము బయటపడెను. నిరుపమ కత్తగారియిల్లు శరశయ్యాసదృశమాయెను. ఒకటి వివాహమైన కొన్నిరోజులకే భర్త డిప్యూటీమేజస్ట్రేటయి దేశాంతరమునందుండెను. రెండవది పితృగృహము వారినేరిని రానీయకుండుట. ఈనడుమ నిరుపమకు జబ్బుచేసెను. దీని కత్తగారు సంపూర్ణదోషియని నిశ్చయింప వీలుకాదు. తన శరీరముపై నామె మిగుల నశ్రద్ధవహించియుండెను. కార్తికమాసమున మంచుకురియుదినములలో రాత్రియంతయు తలవంపుదిక్కునున్న తలుపు తెఱచుకొని నిద్రించుచున్నది. రాత్రియంతయు నామెపై మంచుపడుచునే యున్నది. అన్నపానీయములకు నియమితకాలములేదు. దాసీలు అపుడపుడు ప్రాతఃకాలభోజనమును తెచ్చుట గూడ మరచుచుండిరి. ఐన నామె తననోటితో వారికి జ్ఞాపకముచేయుటలేదు. ఈయింటికి తాను దాసిననియు, గృహయజమానుల దయపై జీవితకాలము వెళ్ళవలెనను భావ మామెలో నాటుకొనెను. అత్తగారికిట్టి భావముకూడ లేకుండెను. అన్నపానీయములపై నెవరైన శ్రద్ధతీసుకొన్న కసరుచు "భాగ్యవంతుల బిడ్డ కాదా! బీదలయింటి అన్నమేల రుచించును? దినదినమున కాయాకారమెట్లగుచున్నదే? మరింతక్రోధము హెచ్చుపెరుగుచున్నదే!"అనును. వ్యాధి ముదిరినపుడన్నియుదొంగవేషములనెను. చివర కొకనాడు నిరుపమ

అత్తగారితో మిగుల వినయముతో ననెను "తండ్రిగారిని, సోదరులను ఒక్కసారి చూడనీయండి, తల్లీ!" అని. అత్తగారు "చాలు. అన్నియు పుట్టినింటికేగుట కనువుగ నేయున్నవి" అనెను.

చెప్పినను ఎవరును నమ్మజాలరు - ఏసంధ్యాసమయమున నిరుపమ కాయాసము హెచ్చెనో నాడే ప్రథమమున డాక్టరామెను చూచెను. ఆదినమే చికిత్సకు అంతిమదినముకూడ ఆయెను.

ఇంటి పెద్దకోడలు మరణించెను. చాలహడావిడిగ కర్మకాండలుజరిగినవి. జమీందారున కెట్టి ఖ్యాతి యుండెనో పెద్దకోడలి యగ్నిసంస్కారవిషయమైగూడ యటులనే ప్రసిద్ధికలిగెను. ఇట్టి చందనకాష్టముల చితి నేటివరకు ఎవరును చూచియుండరు. శ్రాద్ధముకూడ గృహగౌరవమునకు తగురీతినే యొనర్పబడెను. దీనిచే నాతడు కొంత ఋణస్థుడుకూడ ఆయెనని తెలియవచ్చెను.

జనులు రామసుందరున కోదార్పుమాటలుగా కుమార్తె కెంతఘనముగ దహనక్రియ గావింపబడియుండెనో ఆవిషయములజెప్పి సరిపెట్టుచుండిరి.

డిప్యూటీమేజస్ట్రేటువద్దనుండి "నేనన్నియు నిక్కడ సమకూర్చితిని. మీకోడలును శీఘ్రముగ తీసుకొనిరండు" అని తండ్రియగు జమీందారున కుత్తరమువచ్చెను.

జమీందారునిభార్య యుత్తరమువ్రాసెను: "బిడ్డా! నీకొరకై రెండవసంబంధము స్థిరపరుపబడినది. కాన నీవు త్వరగ సెలవుతీసుకొని రావలెను."

ఈమారిరువదివేలరూపాయల రొక్కమప్పటికప్పుడు చేతులలోపడెను. —రవీంద్రుడు.

"ఫలితమెల్లవదలి పతితుడయ్యె"

శ్రీమతి పోతాప్రగడ రాజ్యరత్నమ్మగారు

వైరాగ్యమంతట వెదజల్లునట్లుగా
  జడలుగట్టుక జోలిబూనినాడు
స్నేహంబునకుగానిసంపదయేలని
  చెలికానికంతయు జేర్చినాడు
కాముకుడనుగాను గానుగాననునట్లు
  కమలాసుతునిగోము గఱచినాడు
ఏకపత్నీవ్రతం బెంతేనిఘనమన
  సగముదేహముసతికి జేర్చినాడు
ఇన్నిబాధలంది యీశ్వరుండైనను
జారుడైనచంద్రు స్నేహమునను
వారకాంతగొనుచు వేణిలోనుంచుక
ఫలితమెల్లవదలి పతితుడయ్యె.

కాంత

చిరుమామిళ్ల శివరామకృష్ణప్రసాదుగారు

ఆకలిబాధచే నల్లాడుబీదల
  నాదరంబునగాంచునట్టిపేర్మి
ఉగ్గుతోసౌశీల్యముత్పన్నమౌనట్లు
  కన్నవారలపెంచగల్గుశక్తి
అశ్లీలవాక్యాల ననుగమింపక సదా
  ఆచితూచినుడువులాడునేర్పు
తేనియల్జిల్కెడి తెనుగుప్రబంధాళి
  పఠియించిసంతోషపడెడుప్రజ్ఞ.
ధవునియెడప్రేమ భక్తి మాధవునియెడను
గల్గి దీనులకొంగుబంగారమగుచు
అఖిలసౌభాగ్యములతోడ నలరుచున్న
కాంతయేకద సకలసౌఖ్యప్రదాయి.